# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

శనివారం 20 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 4 pm





## బీజేపీలోకి నటి ఆమని

హైదరాబాద్, ప్రజాస్వరం
సినీనటి ఆమని బీజేపీలోకి చేరారు. శనివారం భారతీయ జనతా పార్టీ లో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కాషాయ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమని ప్రస్తుతం మళ్లీ సినిమాలు, సీరియల్స్‌లో దూసుకుపోతున్నారు. సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలే.

## మలయాళ దర్శకుడు శ్రీనివాసన్ కన్నుమూత

సినిమా, ప్రజాస్వరం



ప్రముఖ మలయాళ నటుడు, రచయిత, దర్శకుడు శ్రీనివాసన్ కన్నుమూశారు. ఆయన వయసు 69 సంవత్సరాలు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన... త్రిపుణి తురలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్రీనివాసన్‌కు భార్య విమల, ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ ఉన్నారు. వీరిద్దరూ మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తుండటం గమనార్హం. తన కెరీర్ లో ఆయన 225కి పైగా చిత్రాల్లో నటించారు.

### 16 మంది ఎమ్మెల్యేలపై

# సీఎం గుస్సా



### పంచాయతీ ఫలితాలపై కాంగ్రెస్ టెలీకాన్ఫరెన్స్

### హాజరైన కాంగ్రెస్ ముఖ్యనేతలు

హైదరాబాద్ , ప్రజాస్వరం
రెబల్స్ ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ చార్జులపై రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించింది. సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. రెబల్స్ ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ చార్జులపై రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయని 16 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెబల్స్ తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు.

**31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. 3,502 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. బీజేపీ 688 స్థానాలు పొందగా... ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు. అయితే తమకు పట్టున్న కొన్ని చోట్ల స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈక్రమంలోనే దానికి బాధ్యులైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశం నిర్వహించింది.**

# ల్యాండింగ్ విఫలం

### పొగమంచు కారణంగా

### వెనక్కి మళ్లిన మోదీ హెలికాప్టర్

కోలకత్తా, ప్రజాస్వరం



పశ్చిమబెంగాల్‌లోని తాహెర్‌పుర్ హెలిప్యాడ్ వద్ద ప్రధాని మోదీ ప్రయాణిస్తున్నహెలికాప్టర్ వెనక్కి మళ్లాల్సి వచ్చింది. ప్రతికూల వాతావరణం కారణం. దృశ్య గోచరత సరిగా లేక ల్యాండింగ్‌కు అంతరాయం ఏర్పడింది . ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వెల్లడించారు.కోల్‌కతా ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో తాహెర్‌పుర్‌కు బయల్దేరారు. దాంతో పైలట్ ల్యాండింగ్‌కు కొద్దిసేపు ప్రయత్నించి విఫలమవడంతో హెలికాప్టర్ తిరిగి కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంది. పొగమంచు కారణంగా హెలిప్యాడ్‌పై ల్యాండింగ్‌కు వీలు కాలేదు. నాదియా జిల్లాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొనాల్సి ఉంది. దాంతో విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్ నుంచే ఆయన వర్చువల్‌గా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. బెంగాల్ తర్వాత ఆయన అస్సాం వెళ్లనున్నారు.




## టీ20 వరల్డ్‌కప్ కోసం టీమిండియా జట్టు

### గిల్ కు షాక్.. ఇషాన్‌కు దక్కిన చోటు

ముంబయి, ప్రజాస్వరం
టీ 20 వరల్డ్ కప్ 2026కు సంబంధించి భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ గా, అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్ గా వ్యవహరించనున్నారు. శుభ్ మన్ గిల్ వైస్ కెప్టెన్సీతోపాటు జట్టులో చోటు కోల్పోయాడు. యశస్వి జైస్వాల్ ఎంపిక కాలేదు. చాలా కాలంగా జట్టుకు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్ అనూహ్యంగా జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఈ మెగా టోర్నీ భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. వరల్డ్ కప్ మ్యాచ్ లు 7 ఫిబ్రవరి 2026 నుంచి ప్రారంభం కానున్నాయి. తుది పోరు మార్చి 8న జరగనుంది.

### జనవరి 11 నుంచి న్యూజిలాండ్తో సిరీస్

అలాగే టీ20 వరల్డ్ కప్ నకు ముందు, జనవరి 11 నుంచి న్యూజిలాండ్ .. భారత్ లో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు వనేలు, అయిదు టీ20లు జరగనున్నాయి. న్యూజిలాండ్ తో టీ20 సిరీస్ లో కూడా టీ20 వరల్డ్ కప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టే ఆడనుంది.

### టీమిండియా జట్టు ఇదే

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్ ), అక్షర్ పటేల్ ( వైస్ కెప్టెన్ ), అభిషేక్ శర్మ, సంజుశాంసన్ , తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, , రింకు సింగ్ , బుమ్రా, అర్షదీప్ సింగ్ , హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ , ఇషాన్ కిషన్ , కుల్ దీప్ యాదవ్ , వరుణ్ చక్రవర్తి

## లక్ష ఇరువై వేల ఉచిత చేపపిల్లల పంపిణీ

మెదక్ డిసెంబర్ 20 (ప్రజా స్వరం)
మత్సకారుల అభివృద్ధి కోసం శనివారం హవేలీ ఘనపూర్ మండలం నాగపూర్ గ్రామంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహాయకారంతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘ పెద్దలు సమక్షంలో ఉచిత చేప పిల్లలు పంపిణీ లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి స్థానిక ఎమ్మెల్యే రోహిత్ కృతజ్ఞతలు ముదిరాజ్ సంఘ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగపూర్ గ్రామ సర్పంచ్ అబేద బేగం, ఉప సర్పంచ్ రమేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్, మాజీ సర్పంచ్ అక్బర్, ముదిరాజ్ సంఘం పెద్దలు గొడ్ల వెంకయ్య, పురం సిద్దయ్య, వెంకట్, రాములు, పరం రాములు, గుట్ట మీది రమేష్, బాలయ్య, కయిత విట్టల్, కమ్మరి జయరాములు, అధికారులు ఏఈవో ప్రశాంత్ గ్రామ కార్యదర్శి చైతన్య, మత్స్యశాఖ అధికారులు, అన్ని వర్గాల సభ్యులు పాల్గొన్నారు...





## కొనసాగుతున్న ప్రభాకర్‌రావు విచారణ

హైదరాబాద్ , ప్రజాస్వరం
హైదరాబాద్ కమిషనర్ వి.సి. సజ్జనార్ పర్యవేక్షణలో తొమ్మిది మంది పోలీసు అధికారులున్న సిట్ పనిచేయనుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు .. కస్టోడియల్ విచారణకు ఈ నెల 26 వరకు సుప్రీంకోర్టు గడువు ఇవ్వడంతో ఇవాళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కొత్త సిట్ సభ్యులతో మొదట సీపీ సజ్జనార్ సమావేశమయ్యారు. మొదట ఎక్కడి నుంచి విచారణకు ప్రారంభించాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఇప్పటికే సిట్ సభ్యుల్లో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న విజయ్ కుమార్ కూడా ఉండటంతో ఆయన వద్ద కేసుకు సంబంధించి పూర్తి సమాచారం ఉంది. ఆయన హయాంలోనే కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది.అనంతరం కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును జూబ్లీహిల్స్ నుంచి సీసీఎస్ ఆఫీసుకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ జూబ్లీహిల్స్ పీఎస్‌కు తీసుకొచ్చారు. విచారణలో భాగంగా సిట్ టీమ్ ప్రభాకర్ రావును ఓ ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

దౌల్తాబాద్ డిసెంబర్ 20( ప్రజాస్వరం)
వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్న ఓ రైతు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన హృదయవిదారక సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామస్తుల కథనం ప్రకారం దౌల్తాబాద్‌కు చెందిన తుమ్మల ఎల్లయ్య అలియాస్ ఎల్లం (47) అనే రైతు ప్రతిరోజు మాదిరిగానే వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. దౌల్తాబాద్ మండల పరిధిలోని బ్రహ్మం అలియాస్ బ్రహ్మచారి భూమిలో ఉన్న వ్యవసాయ స్టాటర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా, అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా రావడంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబానికి ఏకైక ఆధారమైన ఎల్లయ్య మృతితో భార్య, పిల్లలు రోడ్డున పడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

